


ప్రజాజ్యోతి

ఆదిలాబాద్

మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

గురువారం 26-2-2026 | పేజీలు: 16


# మహిళా సిబ్బందికి మార్షల్ ఆర్ట్స్ శిక్షణ

- మహిళా సిబ్బందికి మార్షల్ ఆర్ట్స్ శిక్షణ
- ఆకతాయిలు, పోకిరిల ఆగ డాలకు అడ్డుకట్ట
- మహిళా సిబ్బంది అన్ని రకాల విధులకు సంసిద్ధమై ఉండాలి
- మహిళ ఖైదీలతో, నేరస్తుల తో ప్రవర్తించే తీరుపై ప్రత్యేక శిక్షణ తరగతులు
- మహిళా సిబ్బంది స్వీయ రక్ష ణ తో పాటు సమాజ రక్ష ణ లో కీలకపాత్ర పోషించాలి
- లాఠీ డ్రిల్, కరాటే లో శిక్షణలు
- మూడు రోజుల పాటు జరగ నున్న శిక్షణ కార్యక్రమాలు
- శాంతిభద్రతల సమస్యలలో, ధర్నాలు, ర్యాలీలు జరుగుతు న్న సందర్భంలో చేయు విధు లపై శిక్షణ



**ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 25, (ప్రజా జ్యోతి)**

మహిళా సిబ్బందికి ఆత్మస్థైర్యాన్ని పెంచేలా చేసి, అన్ని రకాల పరిస్థితులలో, విధుల లో సంసిద్ధంగా ఉండేలా కఠి నమైన శిక్షణ అందించనున్న ట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహా జన్ తెలియజేశారు. మూడు రోజులపాటు మహిళా సిబ్బం దికి మార్షల్ ఆర్ట్స్, కరాటే, లాఠీ డ్రిల్ లాంటి వాటిపై పో లీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళా సిబ్బందికి నిష్ణాతులైన కరాటే మాస్టర్ ముకేష్ చే శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం మహి ళా సిబ్బందిని శారీరకంగా, మానసికంగా, వృత్తిపరంగా మరింత దృఢంగా తీర్చిదిద్ద డం,ప్రస్తుత కాలంలో మహిళా పోలీసులపై పెరుగుతున్న బా ధ్యతలను దృష్టిలో ఉంచుకు ని స్వీయ రక్షణ నైపుణ్యాలతో పాటు చట్టపరమైన అవగా హన, ప్రవర్తనా పద్ధతులు, సం ఘటన స్థలంలో తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై సమగ్ర శిక్షణ అందించడం జరుగుతుంది. శిక్షణలో భాగంగా లాఠీ డ్రిల్, కరాటే, ప్రాథమిక స్వీయ రక్ష ణ చిట్కాలు, అత్యవసర పరి స్థితుల్లో స్పందించే విధానం వంటి అంశాలపై ప్రాక్టికల్ సెషన్లు నిర్వహిస్తారు. ఆక తా యిలు, పోకిరిల ఆగడాలకు సమర్థంగా ఎదుర్కొనే ధైర్యం, నైపుణ్యాలు పెంపొందించడ మే లక్ష్యంగా శిక్షణ కొనసాగ నున్నది. ఖైదీలు, నేరస్తులతో వ్యవహరించే సమయంలో పా టించాల్సిన నియమాలు, మహిళా ఖైదీల భద్రత, పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. అద నంగా, శాంతిభద్రతల సమ స్యలు, ధర్నాలు, ర్యాలీలు, ఉ త్సవాల సమయంలో మహి ళా సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై వ్యూహాత్మక శిక్షణ అందించడం జరుగుతుంది. ఆత్మస్థైర్యాన్ని, మానసిక ధై ర్యాన్ని పెంపొందించే కార్యక్ర మాలు జరగనున్నట్లు తెలిపా రు.

## మండలంలో అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలి

- సరిహద్దుల్లో అక్రమ రవాణా జరగకుండా పర్యవేక్షించాలి
- బాధితుల సమస్యల పట్ల బా ధ్యతాయుతంగా వ్యవహరించాలి
- విపిఓ విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలి
- సిబ్బంది విధుల పట్ల క్రమశిక్ష ణ సమయపాలన పాటించాలి
- గంజాయి, గుడుంబా, నాటు సారా, దేశి దారూ లు లేని మండల నిర్మాణానికి కృషి చేయాలి
- భీంపూర్ పోలీస్ స్టేషన్ ఆకస్మి క పరిశీలన
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



# ప్రయోగాలే పాఠాలకు ప్రాణం!

- దండేపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజేశ్వరరావు
- తాళ్లపేటలో మూడు మండలాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల సమావేశం
- పదవీ విరమణ చేయనున్న హెచ్‌ఎం సుదర్శన్‌కు ఘన సన్మానం

**దండేపల్లి ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):** ద్యార్థులకు పాఠ్యాంశాలను కేవలం పుస్తకాల ద్వారా కాకుండా, ప్రయోగాల ద్వారా బోధిస్తే వారికి కళ్లకు కట్టినట్లు సులభంగా అర్థమవుతుందని దండేపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సంఘర్ష రాజేశ్వరరావు అన్నారు. సోమవారం తాళ్లపేట ఉన్నత పాఠశాలలో జన్నారం, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయోగాల ద్వారా నేర్చుకున్న అంశాలను విద్యార్థులు త్వరగా గ్రహించడమే కాకుండా, ఎక్కువ కాలం గుర్తుంచుకోగలుగుతారని ఉపాధ్యాయులకు సూచించారు.

**హెచ్‌ఎం సుదర్శన్‌కు ముందస్తు సన్మానం**

వచ్చే ఏప్రిల్ నెలలో పదవీ విరమణ పొందనున్న తాళ్లపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుదర్శన్‌ను



భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల బృందం ముందస్తుగా ఘనంగా సన్మానించింది. విద్యాశాఖకు ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు కొనియాడారు. ఆయన నిరంతర కృషి, ఉపాధ్యాయులకు ఆయన అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపేట హెచ్‌ఎం సుదర్శన్, రిసోర్స్ పర్సన్లు అప్పల మనోహర్, పాత రమేష్, సీఆర్‌పీ నరసయ్యతో పాటు మూడు మండలాల కాంప్లెక్స్ పరిధిలోని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం పలు బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులు చర్చించారు.




## అనురాగ్ యూనివర్సిటీలో ఆడోల్సేసెంట్ వెల్నెస్ ట్రైనింగ్ :ఇంద్ర కుమార్‌కు సర్టిఫికేషన్

**మంచిర్యాల, 25,ఫిబ్రవరి (ప్రజాజోతి ):** హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన ఆడోల్సేసెంట్ వెల్నెస్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఇంద్ర కుమార్ విజయవంతంగా శిక్షణ పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆయనకు సర్టిఫికేషన్ అందజేశారు. ఈ సర్టిఫికేషన్‌ను ప్రసిద్ధ సైకాలజిస్ట్ విశేష్ ఇంద్ర కుమార్ కు అందజేశారు. కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ, ఈ శిక్షణ యువతలో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడడం, అలాగే మంచి జీవన విలువలను అలవర్చుకోవడం లక్ష్యంగా నిర్వహించబడిందని తెలిపారు. యువత భవిష్యత్తు దిశగా సానుకూల దృక్పథం పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు.

# విద్యుత్ సమస్యలకు 'వాట్సాప్' పరిష్కారం!

- వినియోగదారుల ముంగిటకే ఎన్పీడీసీఎల్ సేవలు
- 7901628348 నంబరుకు 'నమ' అని పంపితే చాలు
- వెల్లడించిన మంచిర్యాల ఎస్‌ఈ బి. రాజన్న



**దండేపల్లి ఫిబ్రవరి 25( ప్రజాజ్యోతి) :** ఝవిద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారులు తమ ఫిర్యాదుల కోసం ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, మొబైల్ నుండే 'వాట్సాప్ చాట్ బాట్' ద్వారా ఫిర్యాదులు నమోదు చేయవచ్చని మంచిర్యాల సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) బి. రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు.

**ఫిర్యాదు నమోదు ఇలా..**

వినియోగదారులు తమ మొబైల్ ఫోన్ ద్వారా 7901628348 నంబరును సేవ్ చేసుకుని వాట్సాప్‌లో 'నమ' అని సందేశం పంపాలి. వెంటనే ఎన్పీడీసీఎల్ కాల్ సెంటర్ నుండి స్పందన వస్తుంది. అందులో ఫిర్యాదు నమోదు (=వస్త్రఅర్‌వతీ జశీఎజూశ్రీఏఅ‌ఙ), ఫిర్యాదు స్థితి (ఙఃఓఏ జశీఎజూశ్రీఏఅ‌ఙ), ఏజెంట్‌తో చాటింగ్ వంటి ఆప్షన్లు కనిపిస్తాయి. ఫిర్యాదు నమోదును ఎంచుకున్నాక, విద్యుత్ సర్వీస్ నంబర్ వివరాలతో సమస్యను సులభంగా తెలియజేయవచ్చు.

**పారదర్శకత.. త్వరితగతిన పరిష్కారం**

కంప్లైంట్ ఐడీ ఫిర్యాదు నమోదు కాగానే ఒక ఐడీ జనరేట్ అవుతుంది. ఈ సమాచారం వెంటనే సంబంధిత క్షేత్రస్థాయి అధికారులకు చేరుతుంది. ఫీడ్ బ్యాక్ సమస్య పరిష్కారమయ్యాక వినియోగదారునికి సందేశంతో పాటు ఐవీఆర్‌ఎస్ కాల్ వస్తుంది. పరిష్కారంపై సంతృప్తి చెందకపోతే ఫిర్యాదును రీ-ఓపెన్ చేసే అవకాశం కూడా ఉందని ఎస్ఈ వివరించారు. వెబ్ సైట్ సేవలు సంస్థ అధికారిక వెబ్ సైట్ ఇష్ఇ.స్త్రఅజూఅ.ఎశ్రీ.ఓఏవ లోని వాట్సాప్ ఐకాన్ క్లిక్ చేసి కూడా ఈ సేవలు పొందవచ్చు. టోల్ ఫ్రీ నంబర్ అత్యవసర పరిస్థితుల్లో వినియోగదారులు 1912 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలని ఆయన కోరారు. సాంకేతికతను అందిపుచ్చుకుని వినియోగ దారులకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించడమే సంస్థ లక్ష్యమని ఎస్ఈ రాజన్న స్పష్టం చేశారు.

## మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్య విద్యార్థులకు శిక్షణ

**మంచిర్యాల, 25, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ కార్యక్రమంలో భాగంగా రెండవ సంవత్సరం వైద్య కళాశాల విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ వైద్య సేవలు, రోజువారీగా సేకరిస్తున్న రిపోర్టులు, సిబ్బంది చేయవలసిన విధులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు విధానం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. అలాగే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణలో ఉపకేంద్రాలు, ఆశా ఆరోగ్య కార్యకర్తల ద్వారా అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా చూపిస్తూ ప్రాక్టికల్ శిక్షణ అందించారు. మాతా,శిశు సంరక్షణ, టీకాల ప్రాముఖ్యత, అసంక్రమణ వ్యాధుల గుర్తింపు,చికిత్సలు, అవగాహన కార్యక్రమాలు, కీటక జనిత వ్యాధులు వాటి వల్ల కలిగే సమస్యలు, ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయంతో రోగులకు అందుతున్న వైద్య సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు అవసరమైన పోస్టర్లను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ అనిల్, వైద్య కళాశాల మంచిర్యాల్ హెల్త్ ఎడ్యుకేటర్ అశోక్, వారి సిబ్బంది, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సిహెచ్‌ఓలు వెంకటేశ్వర్లు, టీవీ సమన్వయకర్త సురేందర్ లు పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత, వైద్య కళాశాల ప్రిన్సిపల్ ల ఆదేశాల మేరకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు.



## మొదటి రోజు ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు పదకొండు మంది విద్యార్థులు గైరాజరు

**జన్నారం,ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి):** జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, కరిమల జూనియర్ కళాశాలలో కలిపి మొదటి రోజు జరిగిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు పదకొండు మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 156 మంది విద్యార్థులకు గాను 150 మంది విద్యార్థులు హాజరయ్యారని, కరిమల జూనియర్ కళాశాలలో 124 మంది విద్యార్థులకు గాను 119 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

## ఎన్నికల విధుల్లో సింగరేణి ఉద్యోగులకు శుభవార్త

**మంచిర్యాల, 25, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):**

ఎన్నికల విధులకు హాజరయ్యే ఎస్సీడబ్ల్యూఏ ఉద్యోగులకు ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్) యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 18, 2026న జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం, పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల సేవా కాలాన్ని "ఆన్ డ్యూటీ" గా పరిగణించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ నిర్ణయం పార్లమెంట్ సాధారణ ఎన్నికలు, తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఎంపీటీసీలు (ఎంపీటీసీస్ ), జెడ్పీటీసీలు (జడ్పీటీసీస్ ) వంటి అన్ని స్థానిక సంస్థల ఎన్నికలకు వర్తిస్తుందని యాజమాన్యం తెలిపింది. ఉద్యోగ సంఘాలు, ఉద్యోగుల నుంచి వచ్చిన వినతులను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇకపై ఎన్నికల విధులకు హాజరైన రోజులను "స్పెషల్ లీవ్ (ఎలక్షన్ డ్యూటీ )"గా కాకుండా లిలి"ఎలక్షన్ డ్యూటీ "గా మస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించింది.

# మందమర్రిలో ఉచిత కంటి శిబిరం.

- 45 మందికి పరీక్షలు,
- 20 మందికి ఉచిత శస్త్రచికిత్సలు.

**మందమర్రి, ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో బుధవారం నాడు ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ (ఆర్.ఎం.పీ) సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. మార్కెట్ ఏరియాలోని పాల చెట్టు సమీపంలో ఉన్న ఆర్.ఎం.పీ సంఘం కార్యాలయంలో ఈ శిబిరం జరిగింది. వేలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం కాకుండా నాణ్యమైన కంటి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.బి.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ బి.వి. రఘునందన్ స్వయంగా పాల్గొని రోగులకు సమగ్రమైన కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో మొత్తం 45 మందికి కంటి పరీక్షలు చేయగా, అందులో 20 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్య నిపుణులు నిర్ధారించారు. ఈ 20 మందికి నందన్ హాస్పిటల్‌లో పూర్తి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. శిబిర నిర్వాహకులు మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించడమే మా లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితుల కారణంగా చాలా మంది సకాలంలో వైద్యం



చేయించుకోలేక అనారోగ్యాన్ని అనుభవిస్తున్నారు. అలాంటి వారికి మేం అండగా నిలబడాలని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశాం, అని పేర్కొన్నారు.స్థానిక ప్రజలు ఈ శిబిరాన్ని హర్షంగా స్వాగతించారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తే పేద ప్రజలకు చాలా మేలు జరుగుతుంది,అని పలువురు అభిప్రాయపడ్డారు.ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఎంతో అవసరమని, ఆర్.ఎం.పీ సంఘం వంటి సంస్థలు ఈ దిశగా మరింత కృషి చేయాలని స్థానికులు కోరారు.ఈ శిబిరం విజయవంతం కావడంతో ఉత్సాహితులైన నిర్వాహకులు రాబోయే రోజుల్లో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని సంకల్పించారు. ఆర్.ఎం.పీ సంఘం, బి.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్‌లు కలిసి మందమర్రి పరిసర గ్రామాలలో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు విస్తరించాలని భావిస్తున్నాయి.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు నలుగురు గైర్హాజరు

- స్క్రైబ్ సహాయంతో పరీక్ష రాసిన ఇద్దరు దివ్యాంగ విద్యార్థులు
- దండేపల్లి కేంద్రంలో 181 మంది హాజరు

**దండేపల్లి,ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేయగా, మొదటి రోజు పరీక్షకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు.

**పట్టుదలతో పరీక్ష రాసిన దివ్యాంగులు**

వైకల్యం చదువుకు అడ్డంకి కాదని దండేపల్లికి చెందిన అజిత్ పాషా, మహేష్ అనే ఇద్దరు దివ్యాంగ విద్యార్థులు నిరూపించారు. శారీరక ఇబ్బందుల వల్ల స్వయంగా రాయలేని స్థితిలో ఉన్న వీరు, అధికారుల అనుమతితో స్క్రైబ్ (సహాయకుడు)ల తోడ్పాటుతో పరీక్షకు హాజరయ్యారు. సహాయకుల ద్వారా సమాధానాలు చెప్పిస్తూ వీరు పరీక్ష పూర్తి చేయడం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థుల పట్టుదలను చూసి తోటివారు, ఉపాధ్యాయులు



అభినందించారు.

**హాజరు వివరాలు**

దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు లింగాపూర్ మోడల్ స్కూల్, కేజీబీవీ ఒకేషనల్ విద్యార్థులు కలిపి మొత్తం 185 మంది పరీక్ష రాయాల్సి ఉంది. అయితే, వీరిలో 181 మంది హాజరుకాగా, నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహకులు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**కొమురం భీం జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి :** కొమరం భీమ్ జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కొమురం భీం జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని టి.జి.టి.డబ్ల్యు.ఆర్.జె.సి బాలికల, బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని, నిబంధనలను పాటించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద



తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు తీసుకురాకుండా చూడాలని, సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు.



# పరీక్షా కేంద్రంలో ఎస్సై తనిఖీ

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

**దండేపల్లి,ఫిబ్రవరి25 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను బుధవారం దండేపల్లి ఎస్సై తహసీనుద్దీన్ సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును, భద్రతా ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పరీక్షలు అత్యంత పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, నిబంధనల ప్రకారం పరీక్షలు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

# విద్యుత్ స్తంభ విఫలం-పొంచి ఉన్న ప్రమాదం

**పెంచికల్ పేట్ మండలం, ఫిబ్రవరి. 25:ప్రజాజ్యోతి:** పెంచికల్ పేట్ గ్రామ పంచాయతీలో ప్రజలకు ప్రమాదకరంగా మారి కిందకు వేలాడుతున్న కరెంట్ తీగలు, వంగిన విద్యుత్ స్తంభాలు. పలు మార్లు సర్పంచ్ విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు మొరపెట్టుకుంటున్నా గ్రామంలో నూతన పోల్స్ ఏర్పాటు చేయడం లేదు.



# బాల్క సుమన్ విడుదల కోసం ప్రత్యేక పూజలు

**రామకృష్ణాపూర్,ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి):** బాల్క సుమన్ అరెస్టును నిరసిస్తూ బొక్కల గుట్ట గాంధారి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని ఆరోపించిన నాయకులు, సుమన్ నిర్దోషిగా తక్షణమే విడుదల కావాలని ఆయన ఆరోగ్యం క్షేమంగా ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజకీయ కక్షసాధింపుల నేపథ్యంలోనే అరెస్టు జరిగిందని ఆరోపించారు. ప్రజల మద్దతుతో ముందుకు సాగుతున్న నాయకుడిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. న్యాయపరమైన పోరాటంతో సత్యం వెలుగులోకి వస్తుందని, బాల్క సుమన్ త్వరలోనే ప్రజల మధ్యకు తిరిగి వస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో 8వ వార్డు సీపీఐ,బీఆర్ఎస్ పార్టీల నాయకులు దేవి సాయిక్రిష్ణ, అనవేని కృష్ణ, చాపిడి సందీప్, చల్లూరి రాజేందర్, సాగర్ల రమేష్, నరేడ్ల మనోహర్, పులి విజయ్, పల్లికొండ వంశీ, గుర్రం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, 25,ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బంధీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల, వేంపల్లి ప్రాంతంలోని ఎస్.ఆర్.ఆర్. కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 16, 2026 వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల వివరాలను వెల్లడిస్తూ, ప్రథమ సంవత్సరం లో జనరల్ 5,372 మంది, ఒకేషనల్ 888 మంది ద్వితీయ సంవత్సరం లయన్ జనరల్ 5,227 మంది, ఒకేషనల్ 830 మంది మొత్తం విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయంలో 163 బి.ఎన్.ఎస్.ఎస్. సెక్షన్‌ను కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా టి.జి.ఎస్.ఆర్.టి.సి. అధికారులు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా పర్యవేక్షణ చేపట్టాలని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల సురక్షిత రవాణాకు తపాలా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాలలో పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బంధీగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య, హాజీపూర్ మండల తహసిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్‌పాండే, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసమే విజయానికి సోపానం



- పరీక్షల్లో విజయం కోసం ఒత్తిడికి దూరంగా ఉండాలి
- పీఎం శ్రీ పాఠశాలల వ్యక్తిత్వ వికాస నిపుణులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్

**మంచిర్యాల, 25, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** పరీక్షల సమయంలో ఎలాంటి మానసిక ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, గత అనుభవాన్ని ఆధారంగా చేసుకుని పదో తరగతి పరీక్షలను అవలీలగా ఎదుర్కోవాలని విద్యార్థులకు పీఎం శ్రీ పాఠశాలల వ్యక్తిత్వ వికాస నిపుణులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్ సూచించారు. మంచిర్యాల జిల్లా భీమారం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షల ముందు, పరీక్షల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, సమయ నిర్వహణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకునే విధానాలపై స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. పదో తరగతి పరీక్షల్లో విజయం సాధించడానికి అవసరమైన విజయ సూత్రాలు, వ్యక్తిగత బలాలుబలహీనతలు, సక్సెస్ మంత్రం, ఆత్మవిశ్వాసం వంటి అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జ్ఞాపకశక్తిని పెంచుకునే పద్ధతులు, పరీక్ష రోజు ఎలా చదవాలి, చివరి నిమిషాల్లో పునశ్చరణ ఎలా చేయాలన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పేదరికం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రముఖుల జీవిత గాథలను ప్రస్తావిస్తూ విద్యార్థుల్లో మనోధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని నింపారు. సదస్సు అనంతరం విద్యార్థులు పరీక్షలను నిర్భయంగా, ఆత్మవిశ్వాసంతో విజయవంతంగా రాస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి. శ్రీనివాస్, సమన్వయకర్త తిరుపతి, ఉపాధ్యాయులు షారీక్, మారయ్య, సలీం, శ్రీదేవి, గోవర్ధనాచారి, ఐటీ నిపుణులు ఎం. శరత్ చంద్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





# నీల్వాయి పోలీసుల ఆధ్వర్యంలో

- బుయ్యారం గ్రామంలో గుడుంబా స్థావారాలపై ప్రత్యేక దాడులు
- అక్రమ గుడుంబా తయారీ నిర్మూలనకు పోలీసుల కట్టుదిట్టమైన చర్యలు

**మంచిర్యాల, 25, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** రామగుండం పోలీస్ కమీషనరేట్, మంచిర్యాల జోన్ పరిధిలోని బుయ్యారం గ్రామంలో నీల్వాయి పోలీస్ స్టేషన్ ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి, చెన్నూరు రూరల్ సీఐ కృష్ణల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిపి సుమారు 40 మంది పాల్గొన్న ఈ దాడుల్లో 20 అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలను గుర్తించి, సుమారు 5 వేల లీటర్ల పులియబెట్టిన బెల్లం మిశ్రమం (గుడుంబా పానకం) ను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ గ్రామ ప్రజలతో మాట్లాడుతూ, అక్రమంగా గుడుంబా తయారీ మరియు విక్రయాలు చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యకలాపాల్లో ఎవరైనా పాల్గొంటే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు సహకరించి అక్రమ మద్య నిర్మూలనకు తోడ్పడాలని కోరారు. ఈ ప్రత్యేక దాడుల్లో చెన్నూరు ఎక్సైజ్ సీఐ హరి, మంచిర్యాల డీటీఫ్ సీఐ సమ్మయ్య, చెన్నూరు ఎక్సైజ్ ఎస్సై రమణ, బెల్లంపల్లి ఎక్సైజ్ ఎస్సై శారదతో పాటు పోలీస్, ఎక్సైజ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్, డిప్యూటీ మేయర్

**మంచిర్యాల, 25, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌లుగా ఎన్నికైన ధర్ని మధుకర్, సల్ల రమ్య లు బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, పట్టణ పరిపాలనలో చేపట్టాల్సిన ప్రాధాన్య అంశాలపై సంక్షిప్తంగా చర్చించారు. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్‌లు జిల్లా కలెక్టర్‌కు మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



# హెల్మెట్ ఉన్నవారికి పుష్పాభినందనడ లేనివారికి హెల్మెట్ పంపిణీ

**మంచిర్యాల , 24, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ) :** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెల చివరి వారం నిర్వహించే “అరైవ్‌అలైవ్” రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం రెండో విడతలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖని మున్సిపల్ టీ జంక్షన్ వద్ద ప్రత్యేక కార్యక్రమంను నిర్వహించారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించడం అత్యంత కీలకమని ప్రజలకు వివరించారు. హెల్మెట్ ధరించి వచ్చిన ద్విచక్ర వాహనదారులకు పుష్పాలు అందించి అభినందించగా, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి హెల్మెట్లు పంపిణీ చేసి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చలాన్ విధించడం జరుగుతుందని, అయితే చలాన్ వల్ల పోలీసులకు లాభనష్టం ఏమీ ఉండదని సీపీ తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉండి, గాయాలు లేదా ప్రాణనష్టం కలగవచ్చని, దాని ప్రభావం కుటుంబాలపై తీవ్రంగా ఉంటుందని ఆయన



హెచ్చరించారు. ఇంటి నుంచి బయటకు వచ్చిన ప్రతిసారి హెల్మెట్ సరిగా ధరించి, సేఫ్టీ లాక్ బిగించి వాహనం నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే బంధువులు, స్నేహితులు, పరిచయస్తులకూ హెల్మెట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, వన్‌టౌన్ ఎస్సై రమేష్ రాముని, ట్రాఫిక్ ఎస్సై హరిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రాంప్ ద్వారా మహిళలకు నిర్మాణాత్మక వ్యాపార త్వరణ మద్దతు

**నస్పూర్,ఫిబ్రవరి 25, ప్రజా జ్యోతి:** రాంప్ మహిళా త్వరణ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎం. ఎస్. ఎం. ఈ. లకు నిర్మాణాత్మక వ్యాపార త్వరణం మద్దతును అందించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్య లతో కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళ వ్యవస్థాపకులకు ఐటిఈ – సి విభాగం, వీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు, భారత ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ మద్దతుతో రాంప్ ద్వారా మహిళల నేతృత్వంలోని సంస్థలు, ఎంఎస్ఎంఈ నిర్మాణాత్మక వ్యాపార రంగాలలో మహిళలను




ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. 2 సంవత్సరాల ఈ కార్యక్రమం ఎంపిక చేసిన మహిళా వ్యవస్థాపకులకు వ్యాపార వృద్ధిని వేగవంతం చేసేందుకు, వారి ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు అవకాశం అందిస్తుందని తెలిపారు. వస్త్రాలు, ఆహార ప్రాసెసింగ్, తయారీ, హస్తకళలు, అభివృద్ధి చెందుతున్న రంగాలలోని సంస్థలు, వ్యాపార నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి అభివృద్ధి, వైవిధ్యీకరణ, బ్రాండింగ్, మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజ్ లకు నిపుణుల మార్గదర్శకత్వంలో మద్దతు అందించడం జరుగుతుందని తెలిపారు.

# ప్రాణ రక్షకులకు గౌరవం.. 108 పైలెట్లకు స్టార్ అవార్డు

అత్యవసర సేవల్లో విశిష్ట కృషికి రాష్ట్ర స్థాయి గుర్తింపు

**ఆసిఫాబాద్ టౌన్ ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి :** సిఫాబాద్ జిల్లాలో అత్యవసర వైద్య సేవల్లో విశేష కృషి చేసిన 108, 102 అంబులెన్స్ పైలెట్లకు స్టార్ పైలెట్ అవార్డు లభించింది. లింగాపూర్, సిర్పూర్ (యు), జైనూర్ మండల కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న రాథోడ్ జగదీష్, జ్ఞానేశ్వర్, రవి, గజానంద్‌లను +ఎఖ జువీ=× సంస్థ ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేసింది. గత ఆరు నెలలుగా అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సేవలు అందించడం, సమయపాలనతో రోగులను ఆసుపత్రులకు తరలించడం, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఉత్తమ సిబ్బందిని ఎంపిక చేసి ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కొమరం భీం ఆసిఫాబాద్ డిస్ట్రిక్ట్ కలెక్టర్ హరిత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాల 108 ప్రోగ్రామ్ మేనేజర్ సామ్రాట్, జిల్లా మేనేజర్ మెరుగు నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అవార్డు పొందిన పైలెట్లను అధికారులు అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే సేవా తపనతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.



# గ్రామ పంచాయితీల పనితీరుపై సమీక్ష

**పంచాయతీ కార్యదర్శులకు కఠిన ఆదేశాలు**

**జైపూర్, ఫిబ్రవరి 19 ( ప్రజా జ్యోతి):** జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీల పనితీరు, పన్నుల వసూళ్లు, ఉపాధి హామీ పనుల పురోగతిపై అధికారులు సవివరంగా చర్చించారు. ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేసి ఈ నెలాఖరు వరకు 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ట్రేడ్ లైసెన్సులను వెంటనే రెన్యువల్ చేయించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం గ్రాంట్ కింద పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని సూచించారు. ఆర్‌టీఐ దరఖాస్తులకు సమయానికి సమాచారం అందజేసి ప్రతులను మండల కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల లోపు హాజరు నమోదు చేసి డి.ఎస్.ఆర్ నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఆలస్యంగా హాజరు నమోదు చేసిన 12 మంది కార్యదర్శులను హెచ్చరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. నర్సరీల నిర్వహణలో 100 శాతం జర్మినేషన్ సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వార్డు సభ్యుల శిక్షణ తరగతులకు ముందస్తు సమాచారం ఇచ్చి హాజరు నిర్ధారించాలని, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం పరిశీలించాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామాల్లో ఈజీఎస్ పనులపై కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 307 మంది లేబర్లు ఉపాధి హామీ పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఫైనల్ ఫోటో క్యాప్చర్ ప్రక్రియను రేపటిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జి. సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపురావు, ఏపీవో బి. బాలయ్యతో పాటు అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధిక వేగం కారణంగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా

**రోడ్డుపై చెల్లాచెదురైన సిమెంటు ఇటుకలు ట్రాఫిక్‌కు అంతరాయం**



**ఆసిఫాబాద్ టౌన్ పబ్రవరి 25 ప్రజా జ్యోతి :** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఒక ప్రమాదం చోటుచేసుకుంది. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖ ఎదుట సిమెంటు ఇటుకలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికుల సమాచారం ప్రకారం, ట్రాక్టర్ అధిక వేగంతో ప్రయాణించడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. వేగ నియంత్రణ కోల్పోయిన ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డుపై ఒరిగిపోయింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న సిమెంటు ఇటుకలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ప్రాంతంలో తరచుగా వాహనాలు అధిక వేగంతో సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు నివారించేందుకు వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వారు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# స్లాబ్ బుకింగ్ చేసినా ఫలితం శూన్యం




**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని శ్రీ గాయత్రీ కాటన్ మిల్స్ వద్ద పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆన్లైన్ స్లాబ్ బుకింగ్ వ్యవస్థ ద్వారా సమయం కేటాయించుకుని, ఆశలతో పత్తి లోడ్లను మిల్లుకు తరలించిన రైతులు చివరికి నిరాశతో వెనుదిరుగుతున్నారని తెలిసింది. పత్తి నాణ్యత బాగోలేదనే కారణంతో కోతలు విధించడం, చివరికి కొనుగోలు నిరాకరించడం వంటి ఘటనలు తరచుగా జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు.నిబంధనల పేరిట కఠిన పరీక్షలు రైతుల వివరాల ప్రకారం.. మిల్లుకు చేరుకున్న వెంటనే పత్తిపై అనేక రకాల నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తేమ శాతం, రంగు, ఫైబర్ నాణ్యత, కలుషితాల స్థాయి వంటి అంశాలను ఆధారంగా చేసుకుని కోతలు విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొన్నిసార్లు లోడును సగం వరకు దించించిన తర్వాత కూడా పత్తి సరిగా లేదు అంటూ తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రైతులు రవాణా ఖర్చులు, కూలీల చెల్లింపులు భరించాల్సి వస్తోందని చెప్పారు. ఆశలతో వెళ్లి నిరాశతో తిరుగు బుధవారం ఒక రైతు స్లాబ్ బుక్ చేసుకుని సుమారు ఎనిమిది క్వింటాళ్ల పత్తిని మిల్లుకు తీసుకువచ్చాడు. గంటల తరబడి పరిశీలన చేసిన తర్వాత చివరికి పత్తి నాణ్యత బాగోలేదని చెప్పడంతో అతను తీవ్ర నిరాశకు గురయ్యాడు. ఇలాగే మరికొందరు రైతులు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారని సమాచారం. రోజంతా వేచి చూసిన తర్వాత కొనుగోలు నిరాకరణ ఎదురైతే రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోందని స్థానికులు తెలిపారు.ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధర మద్దతు ధరకు కొనుగోలు జరగకపోవడంతో రైతులు చివరికి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు పత్తిని విక్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరకు బదులుగా గణనీయంగా తక్కువ మొత్తానికి అమ్ముకోవాల్సి రావడం వల్ల నష్టాలు వాటిల్లుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంటకు సరైన ధర దక్కకపోవడం రైతుల ఆర్థిక స్థితిని దెబ్బతీస్తోందని వారు తెలిపారు.

# మంచిర్యాల ఎయిమ్స్‌లో మెగా రక్తదాన శిబిరం



**మంచిర్యాల, 25, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా పట్టణ కేంద్రంలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో డా. యెగ్గన శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని, డా. యెగ్గన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎయిమ్స్ హాస్పిటల్స్ ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ శిబిరంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షులు, ట్రెజరర్‌తో పాటు బార్ కౌన్సిల్‌కు చెందిన సీనియర్ న్యాయవాదులు, ఉపాధ్యాయులు, ఇంజినీర్లు, పోలీస్ అధికారులు, జర్నలిస్టులు, పలు సామాజిక సంక్షేమ సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమాజంలోని మేధావులందరితో కలిసి రక్తదానంపై అవగాహన పెంపొందించడం, రక్తదానం ద్వారా ప్రాణాలను రక్షించే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయడం ఈ శిబిరం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. రక్తదానం ప్రమాద బాధితులకే కాకుండా థలసేమియా, సికిల్ సెల్ అనీమియా, క్యాన్సర్ రోగులు, గర్భిణీ స్త్రీలు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అత్యంత అవసరమని అన్నారు.




# రాంప్ ద్వారా మహిళలకు నిర్మాణాత్మక వ్యాపార త్వరణ మద్దతు

**మంచిర్యాల, 25, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** రాంప్ (రాంప్ ) మహిళా త్వరణ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా వ్యవస్థాపకులు, ఎంఎస్ఎంఈలకు నిర్మాణా త్మక వ్యాపార త్వరణ మద్దతు అందించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య తెలిపారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్యలతో కలిసి ఐటీఈసీ విభాగం, వీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరల్డ్ బ్యాంకు , మినిస్ట్రీ ఆఫ్ ఎం ఎస్ ఎం ఈ మద్దతుతో అమలవుతున్న రాంప్ కార్యక్రమం ద్వారా మహిళల నేతృత్వంలోని సంస్థలు, ఎంఎస్ఎంఈలను నిర్మాణాత్మక వ్యాపార రంగాల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల వ్యవధితో అమలయ్యే ఈ కార్యక్రమం ఎంపికైన మహిళా వ్యవస్థాపకులకు వ్యాపార వృద్ధిని వేగవంతం చేయడంతో పాటు ఆదాయం పెంపొందించుకునే అవకాశాన్ని కల్పిస్తుందని వివరించారు. వస్త్రాలు, ఆహార ప్రాసెసింగ్, తయారీ, హస్తకళలు తదితర అభివృద్ధి చెందుతున్న రంగాల్లోని సంస్థలకు వ్యాపార నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి అభివృద్ధి, వైవిధ్యీకరణ, బ్రాండింగ్, మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజీలపై నిపుణుల మార్గదర్శకత్వంతో మద్దతు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం ఆసక్తి గల మహిళల నుండి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.



# మరమ్మత్తు పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, టౌన్ ఫిబ్రవరి 25:ప్రజా జ్యోతి :** కోతకు గురైన సీసీ రోడ్డు మట్టి మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆసిఫాబాద్ మండల్ లోని మాణిక్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలో కొమురం భీం ప్రాజెక్ట్ కుడి కాలువ పక్కన కోతకు గురైన సీసీ రోడ్డును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు మట్టి కోతకు గురవడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, సంబంధిత శాఖల సమన్వయంతో మరమ్మత్తు పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికులతో మాట్లాడిన కలెక్టర్ త్వరలోనే పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్ టౌన్ ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి :** ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25: భూ సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. బుధవారం ధ్యానపూర్ విల్లగె లో నిర్వహించిన సదస్సుకు రాజస్వ మండల అధికారి, భూ కొలతల శాఖ సహాయ సంచాలకులు విజయ్ కుమార్, తహసిల్దార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు, తెలంగాణ సర్వే, సరిహద్దుల చట్టం 1923 సెక్షన్ 1, 6(1) ప్రకారం, నక్షాలు మరియు గ్రామ హద్దులు లేని ధ్యానాపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సమగ్ర భూ సర్వే ప్రారంభించడం జరుగుతోందని తెలిపారు. గ్రామానికి స్పష్టమైన హద్దులు లేనందున రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ జి పి ఆర్ ఎస్ సాంకేతికత ద్వారా వ్యవసాయ భూములను సమగ్రంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించబడుతున్నాయని కలెక్టర్ వెల్లడించారు. సర్వే పూర్తైన తర్వాత భూ వివాదాలు తగ్గి, రైతులకు భూములపై స్పష్టమైన హక్కులు లభిస్తాయని, దీర్ఘకాలిక లాభాలు వచ్చే అవకాశముందని తెలిపారు. కలెక్టర్ అగ్రిగేటర్, ఈ పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అలాగే, గ్రామ ప్రజలు అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు ఈ కార్యక్రమాన్ని సమగ్రంగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# కన్నీళ్ల నుంచి దారివరకుడ ఒక గ్రామ గాథ

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):** కౌటాల మండలం పరిధిలోని తాటి నగర్ గ్రామం..ఎన్నో ఏళ్లుగా దుమ్ము, బురద, గుంతల మధ్య జీవన యాత్ర సాగించిన ఓ గ్రామం. ప్రతి వర్షాకాలం గ్రామ ప్రజలకు శాపంగా మారేది. ఆ రహదారి కేవలం మార్గం కాదుడ వారి బాధల కథ.పాఠశాలకు వెళ్లే చిన్నారుల చిన్నచిన్న కాళ్లు బురదలో జారిపడిన సందర్భాలు ఎన్నో. యూనిఫాం మురికిగా మారి, కన్నీళ్లతో ఇంటికొచ్చిన పిల్లల బాధ తల్లిదండ్రుల గుండెల్ని పిండేసేది. వృద్ధులు ఆసుపత్రి చేరాల్సిన సమయాల్లో రోడ్డు గుంతలు ప్రాణాలకు ముప్పుగా మారేవి. గర్భిణీ స్త్రీలు నొప్పులతో విలవిలలాడుతూ అంబులెన్స్ కోసం ఎదురు చూసిన రాత్రులు గ్రామానికి మరిచిపోలేని గాయాలుగా మిగిలాయి. ఇంకెన్నాళ్లు ఈ కష్టాలు? అనే ప్రశ్న ప్రతి ఇంటి మేడపై ప్రతిధ్వనించింది. అధికారుల దృష్టికి వెళ్లినా స్పందన లేక, ఆశలు ఆరిపోతున్న సమయంలో.. కొందరు కలం పట్టిన మనుషులు ఆ గ్రామం వైపు చూశారు. దుర్గం శరత్ చంద్ర, సూరన్న, లింగన్న, రవీందర్, కృష్ణపల్లి సురేష్, కొత్రంగి రమేష్ వంటి జర్నలిస్టులు గ్రామస్తుల గోడును తమ అక్షరాల్లో ఒదిగి పెట్టారు.బురదలో మునిగిన రహదారిని కెమెరాలో బంధించి, కన్నీళ్ల కథలను వార్తలుగా మలిచారు. ఒక కథనం కాదు.. వరుస కథనాలు. ఒక విజ్ఞప్తి కాదుడనిరంతర పోరాటం. వారి కలం కేవలం వార్త రాయలేదు.. ప్రభుత్వ ద్వారాలు తట్టింది. అధికార యంత్రాంగాన్ని కదిలించింది. ప్రజాప్రతినిధుల దృష్టిని ఆకర్షించింది. చివరకు స్పందన వచ్చింది. తాటి నగర్‌కు బీటీ రహదారి మంజూరు అయ్యింది.ఈ రోజు ఆ



గ్రామంలో పనులు సాగుతుండగా, మట్టిదారిలో పెరిగిన పిల్లలు ఇప్పుడు కాంక్రీట్ దారిని చూస్తూ చిరునవ్వులు చిందిస్తున్నారు. వృద్ధులు "ఇప్పుడైనా మా కష్టం తీరింది" అంటూ ఆనందభాష్పాలు కారుస్తున్నారు. తల్లి గుండెల్లో ఒక నమ్మకం మొలిచింది..నా బిడ్డ ఇక జారి పడదు.అయితే, ఈ విజయంలో తమకే క్రెడిట్ తీసుకోవాలని ప్రయత్నించే వారి మాటలు గ్రామస్థుల గుండెల్ని మళ్లీ గాయపరుస్తున్నాయి. సంవత్సరాలుగా పట్టించుకోని వారు ఇప్పుడు గొప్పలు చెప్పుకోవడం సత్యాన్ని మసకబార్చే ప్రయత్నమని గ్రామ పెద్దలు భావించారు. మా కన్నీళ్లను అక్షరాలుగా మార్చిన వారే అసలైన కారణం అని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఈ బీటీ రహదారి కేవలం అభివృద్ధి కాదుడ ఇది ఒక గ్రామ గౌరవం. ఇది నిజాయితీ గల జర్నలిజానికి లభించిన గౌరవ వందనం. ప్రజాస్వామ్యంలో మీడియా శక్తి ఎంత బలమో తాటి నగర్ మరోసారి నిరూపించింది.

# మంచిర్యాల అభివృద్ధే తమ లక్ష్యం: మేయర్ ధర్ని మధుకర్

**మంచిర్యాల, 25, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని మేయర్ ధర్ని మధుకర్ స్పష్టం చేశారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32, 10, 30 డివిజన్లలో కమిషనర్ జి. అన్వేష్‌తో కలిసి మేయర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు, రహదారుల స్థితి, మురుగు కాలువల శుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. మంచిర్యాల పట్టణంలో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించి మురుగు కాలువలను పూర్తిగా శుభ్రం చేయాలని యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు.ఎప్రజల సౌకర్యార్థం చేపట్టే అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, నగర సుందరీకరణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని అధికారులకు మేయర్



సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రస్తుత పాలకవర్గం పనిచేస్తుందని, ప్రజల నుంచి అందిన వినతులపై సానుకూలంగా స్పందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 30వ డివిజన్ కార్పొరేటర్ కర్రె శ్రీనివాస్, 10వ డివిజన్ కార్పొరేటర్ రాచకొండ గోపాలరావు, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, ఆయా డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

# ఒక కౌన్సిలర్ కోసం చట్టం తప్పు, అదే చట్టం చెల్లదు అనడం సిగ్గుచేటు

**ఆసిఫాబాద్ టౌన్ ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి :** ఆసిఫాబాద్: ఒక కౌన్సిలర్ కోసం చట్టాన్ని తప్పు అని, అదే చట్టమే చెల్లదు అని చెప్పడమే సిగ్గుచేటు మాట్లాడటమేనని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఎండి ఆసిఫ్ అలీ మంగళవారం మాజీ మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆసిఫ్ అలీ, టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మునిసిపల్ చట్టం 2019 ను నిర్లక్ష్యం చేయడం దారుణమని విమర్శించారు. "నువ్వే అసెంబ్లీకి అధీనంగా ఉన్నప్పుడు దీనికి హోదా ఇచ్చారు కాదా? ఇప్పుడు అదే చట్టం పనికిరాదు, చెల్లదు అని చెప్పడం అసహ్యకరం" అని అన్నారు. అస్సెంబ్లీ సాక్ష్యంగా మునిసిపల్ చట్టం 2019ను భాగంగా ప్రవేశపెట్టినవారు నువ్వేనని ఆధారంగా ప్రకటించారు. "కేటీఆర్ నీకు నిజమైన



ధైర్యం ఉంటే నీ ప్రభుత్వంలోనే ఈ చట్టం పూర్తి పరిపాలనలో అమలు చేసినట్లుగా గుర్తించుకునో," అన్నారు. "బీఆర్ఎస్ పార్టీపై నీ ప్రేమ, నిజాయితీ ఉంటే చట్టం ఉన్నంతగా ఉన్నదన్నది ఒప్పుకోవాలి," అని ఆయన హెచ్చరించారు.ఒక కౌన్సిలర్ కోసం పూర్తిచేసిన చట్టాన్ని తప్పు అంటూ విస్మరించడం సిగ్గుచేటని ఆయన గుర్తుచేశారు. "మీకు ధైర్యం, ప్రజల్లో వెళ్లి గెలిచి చూపండి, కానీ పార్టీ పక్కనే వచ్చినవారిని గుంజుకుని పద్ధతిని మార్చుకునే పని చేయకండి," అని సూచించారు.

# గోదావరిఖని సిఎంపిఎఫ్ కమిషనర్ హరి పచౌరి కి ఘన పదవీ విరమణ వీడ్కోలు సభ

**మంచిర్యాల, 25, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సిఎంపిఎఫ్) గోదావరిఖని ప్రాంతీయ కమిషనర్×గా దీర్ఘకాలం సేవలందించి ఈ నెలలో పదవీ విరమణ పొందుతున్న రీజినల్ కమిషనర్ హరి పచౌరికి ఘనంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేస్తున్నట్లు సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం. రమాకాంత్, పులి రాజిరెడ్డి బుధవారం తెలిపారు. ఈ ఆత్మీయ పదవీ విరమణ సభ ఈ నెల 27 న గోదావరిఖని మార్కండేయ కాలనీలోని విశ్వ హిందూ పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, హరి పచౌరి తన సేవా కాలంలో వేల మంది ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ముఖ్యంగా పెన్షనర్లకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ సమస్యల పరిష్కారంలో ఆయన సేవలు ప్రశంసనీయమని అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా హరి పచౌరి ఆరోగ్యంతో, ఆనందంగా దీర్ఘాయుష్షుతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో సింగరేణి పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# బ్రెజిల్‌లో లిథియం మైనింగ్‌కు సింగరేణికి ఆహ్వానం

**మంచిర్యాల, 25, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** బ్రెజిల్ దేశంలో చేపడుతున్న లిథియం మైనింగ్ ప్రాజెక్టుల్లో భాగస్వామిగా చేరాలని కోరుతూ బ్రెజిల్‌కు చెందిన ప్రముఖ సీబీఎల్ సంస్థ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం, ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతిను మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు ఈ సందర్భంగా సీబీఎల్ (కంపాన్హియా బ్రసిలీరా డి లిటియో) బోర్డు డైరెక్టర్ డేనియల్ లెమే, సీఈవో వినీసియస్ అల్వారెంగా తమ సంస్థ కార్యకలాపాలు, బ్రెజిల్‌లో ఇప్పటికే చేపట్టిన లిథియం మైనింగ్ ప్రాజెక్టుల వివరాలను సీఎండీకి వివరించారు. ప్రపంచవ్యాప్తంగా లిథియం కీలక ఖనిజంగా మారిన నేపథ్యంలో, ఈ రంగంలో సింగరేణి సంస్థకు ఉన్న అనుభవం, సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని భాగస్వామ్యానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సింగరేణితో పాటు దేశంలోని ఇతర ప్రముఖ సంస్థలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు. లిథియం మైనింగ్ ద్వారా వ్యాపారపరంగా లభించే లాభదాయక అవకాశాలపై వారు విస్తృతంగా వివరించారు. సింగరేణి సంస్థ తరపున డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రు సంస్థ బలాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలను వివరించారు. బ్రెజిల్లో కీలక ఖనిజాల రంగంలో ఉన్న అవకాశాలు, పెట్టుబడుల లాభదాయకత తదితర అంశాలను సవివరంగా అధ్యయనం చేసి, సంస్థాపరమైన నిర్ణయం తీసుకుంటామని సింగరేణి ఉన్నతాధికారులు తెలిపారు. ఈ సమావేశం లిథియం వంటి కీలక ఖనిజాల రంగంలో సింగరేణి అడుగుపెట్టే అవకాశాలకు దారితీయవచ్చని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# అచ్చేలిగ్రామ శివారులో ఉన్న 136సర్వేగల భూమిని జాయిం ట్ సర్వే నిర్వహించాలి

**వ్యవసాయం చేసుకుంటున్న మాకు అటంకాలు సృష్టిస్తున్న ఫారెస్ట్ అధికారులు**

**సిర్పూర్(టి)తహసీల్దార్ రహీముద్దీన్ కు వినతి పత్రం సమర్పించిన ఆచెల్లి రైతులు**



**ఫిబ్రవరి 25, సిర్పూర్(టి) నియోజకవర్గం.ప్రజా జ్యోతి:** కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా (సిర్పూట్ (టి)మండలం ఆ చెల్లి గ్రామపంచాయతీ పరిది శివారు లోని 136. సర్వేనెంబర్ కలిగి ఉన్న భూమిని జాయింట్ సర్వే నిర్వహించాలని తహసిల్దార్ రహీముద్దీన్ కు రైతులు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 30 మంది రైతులైన మేము దాదాపు గత 60 సంవత్సరాలనుండి కాస్తు చేస్తూ జీవనోపాధి గడుపుతు కుటుంబాలను పోషించుకుంటు న్నామని అన్నారు.పిల్లలకు పాఠ శాలకు విద్యాబోధన చేయిస్తూ కాలం వెళ్ళదిస్తూ భయందోళన లో బ్రతుకుతున్నామని అన్నారు గత సంవత్సరాలనుండి నుండి లేని సమస్య ఇప్పుడెందుకు వచ్చిందని,ఫారెస్ట్ అధికారులు మమ్ములను వ్యవసాయం చేయ కుండా ఆటంకము కల్పిస్తూ, భయందోళనకు గురి చేస్తున్నా రని అన్నారు.అచ్చేలిగ్రామ పరిధి లోని శివారులో ఉన్న 136 సర్వే నెంబర్ గలభూమిలో వ్యవ సాయం చేసుకుంటూ దానిపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నామని అన్నారు.ఈ భూమిలో జాయింట్ సర్వే నిర్వహించి,భూ సమస్యను వెంటనే పరిష్కరించి తగు న్యాయం చెయ్యాలని ఆవేదన వ్యక్తం చేస్తూ తహసీల్దార్ రహీముద్దీన్ కు వినతి పత్రం సమర్పించడం జరిగిందని తెలిపారు.

# నాణ్యతకు పెట్టింది పేరు సింగరేణి బొగ్గు




**మంచిర్యాల, 23, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** దేశంలోనే విశ్వసనీయతకు, నాణ్యతకు గుర్తింపుగా నిలిచిన సింగరేణి బొగ్గుకు మార్కెట్లో డిమాండ్ ఎప్పటికప్పుడు పెరుగుతోందని సింగరేణి సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ అన్నారు. బొగ్గు పరిశ్రమలో మార్కెట్ నుంచి వస్తున్న నూతన సవాళ్లను దృష్టిలో పెట్టుకొని, కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా నాణ్యతను మరింత మెరుగుపర్చే దిశగా గోదావరిఖని ఇల్లందు క్లబ్‌లో రామగుండం రీజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోల్ మార్కెటింగ్ సీనారియో, బొగ్గు నాణ్యత, సరఫరా వ్యవస్థ, రవాణా విధానాలు, రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లపై సింగరేణి మార్కెటింగ్, క్వాలిటీ విభాగాల ఉన్నతాధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలకు అవసరమైన బొగ్గును సమయానికి సరఫరా చేయడంలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందని డైరెక్టర్ ఆపరేషన్స్ అన్నారు. కస్టమర్లను ఏ విధంగా సంతృప్తిపరచాలి, సంస్థ అభివృద్ధి ఏ దిశగా సాగాలన్న అంశాలపై స్పష్టమైన అవగాహన ప్రతి ఉద్యోగికి అవసరమని తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగి వరకూ బొగ్గు నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రస్తుతం రామగుండం రీజన్‌లో కస్టమర్లు బొగ్గు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, మార్కెట్‌ను కాపాడుకుంటూ 100 శాతం గ్రేడ్ సాటిస్‌ఫాక్షన్ సాధించేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి జి.యం క్వాలిటీ (కార్పొరేట్) రవికుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) అండ్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి. వెంకన్న జాదవ్, జి.యం మార్కెటింగ్ అండ్ కోఆర్డినేషన్ తాడబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే జి.ఎం క్వాలిటీ (ఆర్జీ రీజన్) పి.వీరభద్ర రావు, ఆర్జీ1, 2, 3, ఏఎల్పీ ప్రాంతాల జి.ఎంలు లలిత్ కుమార్, బి.వెంకటయ్య, మధుసూదన్, నాగేశ్వరరావు సహా వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఏరియా అధికారులు పాల్గొన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన బొగ్గు సరఫరా కొనసాగించడమే సింగరేణి ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం: సర్పంచ్ ఆనందరావు

**కెరమెరి ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి :** క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతో మేలు చేస్తాయని కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు అన్నారు. బుధవారం కెరమెరిలో నిర్వహిస్తున్న జాతీఐ ఎవఅన్ఫ్‌వంఋతీఋ ాఋఋఎఎ జీ్ఋతీఋ సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని, శారీరక దారుఢ్యం కోసం ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో ప్రతిభ వెలుగులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్, నాయకులు రఘునాథ్, నిర్వాహకులు ఎల్లప్ప, దేవరావు తదితరులు పాల్గొన్నారు.



## రజక కులానికి చెందిన పాప చంపడం దారుణం

**ఆసిఫాబాద్ టౌన్ ఫిబ్రవరి 25 ప్రజా జ్యోతి :** రజక సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఈరోజు నిర్వహించిన బందుకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ రూపునార్ ముఖ్య అతిథిగా హాజరై ఘటించిన ఘోర ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామం లో ప్రతి సంవత్సరం జరిగే శ్రీ మల్లికార్జున స్వామి ఉత్సవాలు సందర్భంగా ఈనెల 18న, ఒక మహిళ తన బిడ్డతో ఆలయంలో టికెట్ లేకుండా ప్రవేశించగా, ఆ గ్రామ సర్పంచ్ మరియు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు దుర్భాషలాడుతూ పాపపై విచక్షణారహిత దాడి చేశారు. దాడిలో పాప 2 గజాల మేరకు పడినట్లు తెలిపారు. పాపను తల్లి వైద్యుడి దగ్గరికి తీసుకెళ్ళింది, అయితే పాప మృతి చెందినది. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్య తీసుకోలేదని బీసీ నాయకులు చెప్పారు. రమేష్ రూపునార్, "ఇప్పటికీ అధికారులు స్పందించి, ఈ మరణానికి కారణమైన అగ్రకులాల నాయకులు మరియు సర్పంచ్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. లేకుంటే రాష్ట్రమంతా ధర్నాలు, ఉద్యమాలు చేయాల్సి వస్తుంది," అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల రజక సంఘ అధ్యక్షులు వేములవాడ గణపతి, తిర్యాణి రజక సంఘ మండల అధ్యక్షుడు రేగళ్ల రాజమౌళి, సంఘ సభ్యులు వేములవాడ రమేష్, పిప్రే సాయి, రాములు, చిరంజీవి, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐ మందమర్రిలో ఉచిత ఈవీ శిక్షణ.

**మందమర్రి, ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి):** స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) మందమర్రిలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకమైన ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై 4.0) కింద ఈ శిక్షణను అందజేయనున్నారు.ప్రస్తుతం ఆటోమొబైల్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సును ఎంపిక చేశారు. ఇది మూడు నెలల స్వల్పకాలిక కోర్సు అని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీస్ టెక్నీషియన్. శిక్షణ కాలం, 3 నెలలు.తరగతుల ప్రారంభం, మార్చి 2, 2026.ఆసక్తి కలిగిన అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ వెంట ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా (ఎస్ఎస్సి మెమో ), ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, బ్యాంకు ఖాతా పుస్తకం , ఈమెయిల్ ఐడి, ఫోన్ నంబర్‌ను తీసుకురావాలని సూచించారు. ఈ శిక్షణలో చేరదలచిన వారు నేరుగా ఐటీఐ మందమర్రి కార్యాలయంలో 7013846573, 9154549697 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని కోరారు. మంచిర్యాల జిల్లా, మందమర్రి యువత ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలి



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఫిబ్రవరి 25 ,( ప్రజాజ్యోతి ):** జిల్లాలో బాల్యవివాహాలు, మాదక ద్రవ్యాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు వంటి సామాజిక సమస్యలను సమూలంగా నిర్మూలించేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి మాదక ద్రవ్యాల నిర్మూలన, బాల్యవివాహాల నివారణ, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం అమలు, రహదారి భద్రత, బాల కార్మికుల సంరక్షణ, మున్సిపల్ అంశాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. గత సంవత్సరం 45, ఈ ఏడాది ఇప్పటివరకు 2 బాల్యవివాహాలను అడ్డుకున్నామని కలెక్టర్ తెలిపారు. బాల్యవివాహాల సమాచారం అందిన వెంటనే సంక్షేమ, పోలీసు, విద్యాశాఖలు సమన్వయంతో వెళ్లి అడ్డుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, నిర్ణీత వయస్సు వచ్చే వరకు వివాహం జరపబోమని ధృవీకరణ పత్రాలు తీసుకోవాలన్నారు. బాల్యవివాహాలను ప్రోత్సహించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాలబాలికలకు విద్యను అందించడంతో పాటు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన చర్యలు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందినట్లు పేర్కొన్నారు. జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. గంజాయి, నాటు సారా వంటి నిషేధిత పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు నమోదు చేయాలన్నారు. విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

**రహదారి భద్రత**

జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. జీబ్రా క్రాసింగ్‌లు, రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**బాల కార్మికుల నిర్మూలన**

ఆపరేషన్ ముస్కాన్ కింద బాల కార్మికులను గుర్తించి సంరక్షణ కల్పించాలని సూచించారు. రక్షించిన పిల్లలను విద్యాసంస్థల్లో చేర్పించి పునరావాసం కల్పించాలని, బాల కార్మికులను నియమించిన యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు, రోగ నిర్ధారణ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని వైద్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై పీసీ, పిఎన్‌డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనధికార ఆర్ఎంపీలను గుర్తించి, ప్రథమ చికిత్సకు మించి చికిత్సలు చేయకుండా నియంత్రించాలని సూచించారు. అలాగే అన్ని మున్సిపాలిటీల్లో వీధిదీపాల సమస్యలు లేకుండా చూడాలని, మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, బాల్యవివాహాల నిరోధంలో పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతున్నాయని చెప్పారు. సమాచారం అందిన వెంటనే స్పందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం "బాలవివాహ ముక్త భారత్" కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను కలెక్టర్, ఎస్పీ తదితరులు ఆవిష్కరించారు.

# ప్రజల్లో ఆహారభద్రతపై అవగాహన పెంపొందించాలి




**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఫిబ్రవరి 25 ,( ప్రజాజ్యోతి ).:** పజల్లో ఆహారభద్రతపై అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో ఫుడ్ సేఫ్టీ కి సంబంధించిన అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలు, మండలాల వారిగా ప్రజలకు, వ్యాపారులకు ఆహార భద్రతకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. వ్యాపారులందరూ కచ్చితంగా ఆహార భద్రత నియమాలు పాటించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో అవగాహన కలిగేలా విద్యా, వైద్యారోగ్య శాఖ అధికారులు సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టాలని వివరించారు. వర్క్ షాప్ లు నిర్వహించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఫుడ్ సేఫ్టీ నియమ, నిబంధనలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఆహార భద్రత నియమాలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ఫుడ్ సేఫ్టీ అధికారి బి.ప్రత్యూష అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ టి. నాయక్, డిఇఓ భోజన్న, డిపిఓ శ్రీనివాస్, డిఎంహెచ్వో రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.



# చిత్తడి నేలల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఫిబ్రవరి 25 ,( ప్రజాజ్యోతి ):** ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో చిత్తడి నేలలు (వెట్ ల్యాండ్స్) అత్యంత కీలకపాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చిత్తడి నేలల గుర్తింపు, సంరక్షణపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న చిత్తడి నేలలను శాస్త్రీయంగా గుర్తించి, వాటిని అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో భాగంగా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి, సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వేలు నిర్వహించాలని సూచించారు. చిత్తడి నేలల వల్ల భూగర్భ జలమట్టం పెరగడమే కాకుండా, జీవవైవిధ్యం పెంపొందుతుందని, వీటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో గుర్తించిన చిత్తడి నేలలను కేవలం పర్యావరణ దృక్కోణంలోనే కాకుండా, పర్యాటక కేంద్రాలుగా కూడా తీర్చిదిద్దే అవకాశం ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి, సమగ్ర నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి (డిఎఫ్ఓ) సుశాంత్ సుఖదేవ్ బోబడే, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహ రెడ్డి, మత్స్య శాఖ ఏడి రాజ నర్సయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులతో అరైవ్ అలైవ్ ర్యాలీ నిర్వహిస్తున్న - ఎస్సై ఇమ్రాన్ ఖాన్

**నేరడిగొండ ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి ):** నేరడిగొండ మండలం రక్షణ శాఖ జడ్పిహెచ్ఎస్ పాఠశాల నేరడిగొండ విద్యార్థులతో రోడ్డు భద్రతను భాగంగా "అరైవ్ అలైవ్" ర్యాలీ పెద్ద మొత్తంలో నిర్వహించడం జరిగింది. నేరడిగొండ మండల ఎస్సై ఇమ్రాన్ ఖాన్ మాట్లాడుతూ శాంతి భద్రతలో భాగంగా ప్రతి వ్యక్తి రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ద్విచక్ర వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని మరియు రోడ్డు భద్రత నిబంధనలు నియమాలను కచ్చితంగా పాటించాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఇమ్రాన్ ఖాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ డిపార్ట్మెంట్ సిబ్బంది విద్యార్థులు గురువులు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.



# ఇంటర్ పరీక్షలను ప్రశాంతం గా నిర్వహించాలి



**ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 25, (ప్రజా జ్యోతి):** జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షి క పరీక్షలను అత్యంత పక డ్బందీగా, ప్రశాంతమైన వాతా వరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధి కారులను ఆదేశించారు. బు ధవారం నుంచి ఇంటర్ పరీక్ష లు ప్రారంభమైన నేపథ్యంలో, జిల్లా కేంద్రంలోని తెలంగాణ బాలికల సాంఘిక సంక్షేమ నివాస జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాల ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజ న్‌తో కలిసి ఆయన ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు పరీక్షకు మొత్తం 9,396 మంది విద్యార్థులకు గాను, 8,839 మంది హాజరయ్యారని, 557 మంది గైర్హాజరయ్యారని వెల్ల డించారు. పరీక్షా కేంద్రాల్లో వి ద్యార్థులకు అవసరమైన కనీ స వసతులు కల్పించాలన్నా రు. తాగునీరు, వెలుతురు, వి ద్యార్థులు కూర్చోవడానికి సరై న బెంచీలు ఉన్నాయా లేదా అని స్వయంగా పరిశీ లించా రు. అత్యవసర సేవల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబి రా లను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద నిబంధ నల అమలులో ఎటువంటి రాజీ పడకూడదని కలెక్టర్ స్ప ష్టం చేశారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వా తే లోపలికి అను మతించాల న్నారు. అనధికార వ్యక్తులు కేంద్రం పరిసరాల్లోకి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా గదుల్లో సి సి కెమెరాల పనితీరును ప రిశీలించిన ఆయన, నిరంత రం రికార్డింగ్ జరిగేలా చూడా లన్నారు. సమయపాలన వి షయంలో విద్యార్థులు, సిబ్బం ది అప్రమత్తంగా ఉండాలని, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పో లీస్ బందోబస్తు కొనసాగించా లని ఎస్పీకి సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, శిక్ష ణ ఐపీఎస్ రాహుల్, జిల్లాఇం టర్మీడియట్ విద్యాశాఖ అధి కారి గణేష్ జాదవ్, చీఫ్ సూ పరింటెండెంట్లు, ఇతర విద్యా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# 'లెర్న్ స్మార్ట్ విత్ కార్యక్ర మాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 25, (ప్రజా జ్యోతి):** ప్రాథమిక స్థాయిలోనే విద్యా ర్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయా లనే లక్ష్యంతో కృత్రిమ మేధ (ూ×) ఆధారిత విద్యాబోధన కార్యక్రమాన్ని ప్రారంభించామ ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం భుక్తా పూర్‌లోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐ టి డి ఏ ఉట్నూర్ సహకారంతో ధ్యే య లెర్నింగ్ సొల్యూషన్స్ ఆ ధ్వర్యంలో నిర్వహిస్తున్న 'లెర్న్ స్మార్ట్ విత్ ూ×' కార్యక్రమాన్ని ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్ తో కలిసి కలెక్టర్ జ్యో తి ప్రజ్వలన చేసి ప్రారంభించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాథమిక స్థా యిలోనే విద్యార్థులకు ూ× టూ ల్స్‌పై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో పోటీ ప రీక్షలను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని అ న్నారు. ప్రస్తుతం 8వ తరగతి విద్యార్థుల కోసం ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో హైబ్రిడ్ లె ర్నింగ్ మోడల్‌ను అమలు చే స్తున్నట్లు తెలిపారు. దీని ద్వా రా విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెరగడంతో పాటు సబ్జెక్టులపై పట్టు బలపడు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తొలి విడతగా ఐటీ డీఏ పరిధిలోని 2 పాఠశాల లు, విద్యాశాఖ పరిధిలోని 8 పాఠశాలలు కలిపి మొత్తం 10 పాఠశాలల్లోని 600 మంది వి ద్యార్థులకు ఈ శిక్షణ అందిం చనున్నట్లు వివరించారు. ఐ టీడీఏ పీవో యువరాజ్ మ ర్మాట్ మాట్లాడుతూ, ఆర్టి



ఫిషియల్ ఇంటెలిజెన్స్ సాం కేతికతను ప్రభుత్వ పాఠశా లల విద్యా వ్యవస్థకు అను సంధానం చేస్తూ, చాట్ జిపి టి, గూగుల్ జెమినీ వంటి ఆ ధునిక ూ× టూల్స్‌ను విద్యా ర్థుల పాఠ్యాంశాలకు అనుగు ణంగా బోధించనున్నట్లు తెలి పారు. ఎనిమిది నెలలపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో రి పోర్ట్ కార్డులు, అసెస్‌మెంట్ల ద్వారా విద్యార్థుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'లెర్న్ స్మార్ట్ విత్ ూ×' పోస్టర్‌ను ఆవిష్కరించి, అనం తరం కంప్యూటర్ ూ× ల్యాబ్ ను కలెక్టర్, పీవో ప్రారంభించా రు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, డివైఎస్ఓ శ్రీనివాస్, ఏటిడిఓ నిహారిక, సెక్టోరల్ అ ధికారులు లక్ష్మణ్, అజయ్, దేయా సంస్థ సీఈఓ ప్రణవి, ప్రధానోపాధ్యాయులు స్వర్ణ లత, ఇతర అధికారులు, ఉ పాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.

# మారుతున్న సాంకేతికకు అ నుగుణంగా నైపుణ్యాన్ని పెం పొందించుకోవాలి

**ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 25, (ప్రజా జ్యోతి):** ప్రాథమిక స్థాయిలోనే విద్యా ర్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు కృత్రిమ మేధ (ూ×) ఆధారిత విద్యాబో ధన చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలి పారు. బుధవారం తలమడు గు మండలం భరంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ సహకారంతో ధ్యేయ లెర్నింగ్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'లె ర్న్ స్మార్ట్ విత్ ూ×' కార్యక్రమా న్ని ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్తో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాథమిక స్థా యిలోనే విద్యార్థులకు ూ× టూ ల్స్‌పై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో పోటీ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొ నే సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. ప్రస్తుతం 8వ తరగ తి విద్యార్థుల కోసం ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో హైబ్రిడ్ లె ర్నింగ్ మోడల్‌ను అమలు చే స్తున్నట్లు తెలిపారు. దీని ద్వా రా విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెరగడంతో పాటు సబ్జెక్టులపై పట్టు బలపడు తుందని ఆశాభావం వ్యక్తం చే శారు.



# హైకోర్టు తీర్పుతో హర్షం వ్యక్తం చేసిన తెలంగాణ ఉద్యమకారుడు

**నేరడిగొండ ఫిబ్రవరి 25 (ప్రజాజ్యోతి ):** తెలంగాణా ఉద్యమ కారులకు హైకోర్టు గుడ్ న్యూస్ చెప్పింది, 8 వారల్లోపు, ఇల్ల స్థలాలు మరియు పెన్షండ్లు మంజూరు చెయ్యాలని, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యమ జేఏసీ నాయకులు పిటీషన్ దాకలు చేసారు, పిటిషనర్ తరపు వాదనలు వినిపించిన న్యాయవాది కరుణాకర్ రెడ్డి, అర్హులైన ఉద్యమకారులకు అభయహస్తం పథకాల కింద పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, జస్టిస్ విజయసేనారెడ్డి ఆదేశాలు జారీ చేశారు ఈమెరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఫ్రీడమ్ ఫైటర్ శాఖ అధికారులకు, 8 వారాల గడువు విధించారు, చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న, తమ డిమాండ్ల పై హైకోర్టు సానుకూలంగా, స్పందించటంతో, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల్, కుమారి గ్రామానికి చెందిన, కుంట కిరణ్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేసారు.

# వివాహ వేడుకలో బోథ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



**నేరడిగొండ ఫిబ్రవరి 25(ప్రజాజ్యోతి ):** నేడు నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామానికి కూన కవిత కూతురు, తాంసి గ్రామానికి చెందిన పొచన్న కుమారుడు వివాహ వేడుక ఉండం గ్రామంలో ఆయేషా ఫంక్షన్ హాల్లో వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ఆయన వెంట డిసిసిబి చైర్మన్ అడ్డి బోజరెడ్డి , తలమడుగు మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, తాంసి మండల మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, తలమడుగు మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, సుంకుడి మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్ బోథ్ సర్పంచ్ అన్నపూర్ణ మహేందర్ ,బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి , నాయకులు రామన్న యాదవ్, మౌలానా తదితరులు ఉన్నారు.

# పాఠశాలకు ఆర్ఓ ప్లాంట్ అందజేత

**బోథ్, ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని హిందీ ఉన్నత పాఠశాలకు బోథ్ మండలంలోని మర్రపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎల్ గంగాధర్ బుధవారం ఆర్వో ప్లాంట్ ను అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని వేసవిలో దాహార్తిని కొంతవరకైనా తీర్చాలని ఉద్దేశంతో అందజేసినట్లుగా పేర్కొన్నారు. ముఖ్యంగా తన తల్లిదండ్రులు అయినా రాములప్ప గంగుబాయి జ్ఞాపకార్థం 8 వేల రూపాయల వాటర్ ఆరో ప్లాంట్ ను పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు. గతంలో కూడా ఆయన ఆదిలాబాద్ లోని పలు పాఠశాలలకు అలాగే బోథ్ మండలంలోని మర్లపల్లి పాఠశాల కూడా ఆర్వో ప్లాంట్ ను కూడా అందజేసినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లచ్చిరాం, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఆసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలి



**ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 25, (ప్రజా జ్యోతి) :** మహారాష్ట్ర తో సరిహద్దుతో ఉన్నందున ఆసాంఘిక కార్య కలాపాలు అక్రమ రవాణా జరగకుండా మండలాన్ని ప్రశాంతంగా ఉండేవిధంగా పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. భీం పూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా "అరైవ్ అలైవ్ 2.0" సందర్భంగా ప్రజలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రమాదాల నివారణ కృషి చేయాలని తెలిపారు. మండలంలో గంజాయి గుడుంబా దేశిదారు లాంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండే విధంగా ప్రజలకు ప్రోత్సహించాలని తెలిపారు. నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని ప్రజలు సన్మార్గం వైపు వెళ్లేలా ప్రయత్నించాలని తెలిపారు. ముఖ్యంగా లైసెన్స్ మేళ ద్వారా యువతకు డ్రైవింగ్ లైసెన్స్ త్వరగా అందే విధంగా చర్యలను చేపట్టాలన్నారు. సిబ్బందిని విడుదల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని విధులలో క్రమశిక్షణ సమయపాలన తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. మండలంలో ఎలాంటి ఆసాంఘిక కార్యకలాపాలు అక్రమ రవాణా జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. ముఖ్యంగా వీపియో విధానాన్ని అమలు చేసి సమాచార వ్యవస్థను పటిష్టం చేసు కోవాలని గ్రామ గ్రామాన పోలీసు సిబ్బందికి సమాచారం అందించే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని తెలిపారు. నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ ఉండాలని, నేరం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కోర్టుల నందు శిక్షలు పడే విధంగా చార్జి షీటును దాఖలు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితుల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించాలని వారి సమస్యలను త్వరితగతిగిన పరిష్కరించి న్యాయం చేసిన సందర్భంలో పోలీసుల పట్ల గౌరవం నమ్మకం మరింత పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సిఐ జి శ్రావణ్, భీంపూర్ ఎస్ఐ బి విక్రమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం కావాలి

**ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 25, (ప్రజా జ్యోతి):** మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మూడవ వార్డు బెల్లూరి కాలనీలో వినాయక ఎస్ హెచ్ జి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోకో పిట్ యూనిట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ అనూషతో కలిసి ఆయన ప్రారంభించారు. రూ.3 లక్షల వ్యయంతో వినాయక స్వయం సహాయక సంఘానికి చెందిన 10 మంది సభ్యులతో ఈ కోకో పిట్ యూనిట్‌ను స్థాపించి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. కోకోపిట్ యంత్రంలో కొబ్బరి బోండాలను వేయడం ద్వారా అవి పీచుగా మారుతాయని, ఆ పీచును విగ్రహాల తయారీ కి, నర్సరీలలో మొక్కల పెంపకానికి, భూమిలో ఎరువుగా వినియోగించడానికి ఉపయోగించవచ్చని వివరించారు. ఈ యూనిట్ ద్వారా పర్యావరణ హిత ఉత్పత్తులు తయారవడంతో పాటు మహిళలకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ అనూష మాట్లాడుతూ, ప్లాస్టిక్ నియంత్రణకు, పర్యావరణ పరిరక్షణకు ఈ యూనిట్ ఎంతో దోహద పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా పీడీ రాజు, మెప్మా డిఎంసి శ్రీనివాస్, టీఎంసి భాగ్యలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు సరిత, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.





## బ్యాంకింగ్ లక్ష్యాలను నిర్దేశిత గడువుగా పూర్తి చేయాలి

**ఆదిలాబాద్ బ్యూరో 25, (ఫిబ్రవరి) (ప్రజా జ్యోతి):** బ్యాంకింగ్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్, పిఐసి చైర్మన్ రాజర్షిషా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డిసిసిబి బ్యాంక్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన ఉమ్మడి జిల్లా బ్యాంక్ మేనేజర్లు, నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత సంవత్సరం ముగింపునకు వస్తున్న తరుణంలో బ్యాంక్ కార్యకలాపాలను మరింత వేగవంతం చేతారని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మార్చి నెలాఖరు నాటికి నిర్దేశించుకున్న అన్ని బ్యాంకింగ్ లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా మొండి బకాయిల (ఎన్ పి ఏలు) వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే డిపాజిట్ల సేకరణను భారీగా పెంచాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని బ్యాంక్ మేనేజర్లు తమకు కేటాయించిన లక్ష్యాలను సాధించడంలో చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో సీఈఓ సిహెచ్. రవి, జనరల్ మేనేజర్ సూర్యప్రకాష్, డిఆర్ఓ వై.ఎస్.డి సింహాచలం, డీజీఎంలు, ఏజీఎంలు మరియు ఉమ్మడి జిల్లాలోని వివిధ శాఖల మేనేజర్లు, నోడల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాసర ట్రిబుల్ ఐటీ లో మరో విద్యార్థిని ఆత్మహత్య

**ప్రేమే ప్రాణం తీసిందా**

**ప్రేమ విఫలం కావడంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని**



**బాసర ఫిబ్రవరి 25 (ప్రజా జ్యోతి) :** బాసర ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న వసంత మృతి కేసులో పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో సంచలన విషయాలు బయటపడుతున్నాయి. ప్రేమ వ్యవహారం విఫలమవడం తోనే వసంత ఆత్మహత్య చేసుకుందని తెలుస్తోంది. వనపర్తి జిల్లా పాంగల్ మండల అన్నారం తండాకు చెందిన వసంత.. ఖిర్యాతండాకు చెందిన గణేష్ అనే యువకుడు ఐదేళ్లుగా ప్రేమించుకున్నట్లు త్వరలోనే పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఇద్దరి సామాజిక వర్గం కూడా ఒకటే.. కానీ ఇరు కుటుంబాల్లో వీరి ప్రేమ వ్యవహారం ఇష్టం లేకపోవడంతో గత కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నట్లు గత రాత్రి కూడా గణేష్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు వసంత. ఇంతలోనే ఏమైందో తెలియదు కానీ.. వసంత ఫోన్‌ను బ్లాక్ చేశాడు గణేష్. వాట్సాప్‌లోను బ్లాక్ చేయడంతో మరింత మనోవేదనకు గురైంది.నేపథ్యంలో ఎంత ప్రయత్నించిన గణేష్ నుండి స్పందన లేకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని వసంత నిశ్చయించుకుంది. ఇంతలోనే గణేష్ ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందడంతో మరింత మనోవేదనకు గురైన వసంత చేతిని కత్తితో కట్ చేసుకుంది. అక్కడితో ఆగకుండా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గంటల వ్యవధిలోనే ప్రేమికులు ఇద్దరు చనిపోవడంతో ఇటు ట్రిపుల్ ఐటీలో అటు వనపర్తి జిల్లాలో విషాద చాయలు అలుముకున్నాయి. నువ్వు లేని లోకంలో నేను ఉండలేనంటూ ఒకరి తర్వాత ఒకరు ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది.బాసర ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న వసంత.. యమునా గర్ల్స్ హాస్టల్‌లో ఉంటుంది. గత రాత్రి ఓ ఫోన్ రావడంతో భయాందోళనకు గురైంది. అయితే ఆ ఫోన్ చేసింది ఎవరు.. ఎందుకు వసంత ఆత్మహత్య చేసుకుంది. ఉరి వేసుకున్న వసంత చేతిపై గాయాలు ఎందుకు ఉన్నాయి.. ఉరి వేసుకునే కంటే ముందే చేతులు, గొంతుపై గాయం చేసుకుందా.. పోలీసులు చెబుతున్న ప్రాథమిక సమాచారంలో నిజమెంత అనే విషయాలు నిగ్గు తేలాల్సి ఉంది. వసంత మృతదేహాన్ని బైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా.. లావుడ్యా గణేష్ మృతదేహాన్ని హైదరాబాద్ నుండి స్వస్థలం ఖిర్యా తండాకు తరలించారు.ద

# ఎన్ ల్యాబ్స్ ఐటీ సంస్థ ను సందర్శించిన జిల్లా కలెక్టర్

**మావల, ఫిబ్రవరి 25, (ప్రజా జ్యోతి):** మావల మండల కేంద్రంలోని ఎన్ -ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఐటీ సంస్థ ను ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్ తో కలిసి బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా సందర్శించారు.ఈ సందర్భంగా ఐటీ విభాగం పనితీరు, సిబ్బంది వివరాలను ప్రతినిధులు కలెక్టర్ కు వివరించారు.ఈ పరిశీలనలో సంస్థ ప్రతినిధులు ప్రణవి, అంకిత్, దినేష్, శ్రీదివ్య, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

